ఊరట అంటూ భారం మోపారు

- ఎన్నికల హామీలను చంద్రబాబు తుంగలో తొక్కారు
- పాలనలో కూటమి ప్రభుత్వం ఫెయిల్
- మాజీ మంత్రి తానేటి వనిత ధ్వజం
- విద్యుత్ చార్జీల పెంపుపై కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- మూడు నియోజకవర్గ కేంద్రాల్లో పోరుబాట ర్యాలీలు
- చార్జీలు తగ్గించాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు



విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా గోపాలపురంలో మాజీ మంత్రి తానేటి వనిత సారథ్యంలో పోరుబాట ర్యాలీ



నిడదవోలు పోరుబాటలో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ శ్రేణులు

గోపాలపురం: పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి తానేటి వనిత ధ్వజమెత్తారు. కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం కదం తొక్కాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కొవ్వూరు డివిజన్‌లోని మూడు నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పోరుబాట నిర్వహించాయి. గోపాలపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు అమలు కాని హామీలిచ్చి, అధికారం చేపట్టాక నిలువునా మోసగించారన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం, సంపద సృష్టిస్తాం, మీరే ప్రభుత్వానికి విద్యుత్ సరఫరా చేసే స్థాయి కల్పిస్తామంటూ లేనిపోని వాగ్దానాలిచ్చారని గుర్తు చేశారు. తీరా ఇప్పుడు బడుగు బలహీన వర్గాలపై రూ.15,485 కోట్ల చార్జీల భారం మోపారన్నారు. ఈ బాదుడు భారాన్ని ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి వనిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా గోపాలపురంలోని కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చెక్ పోస్టు సెంటర్ వద్దకు చేరుకుని దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. తర్వాత అక్కడి నుంచి భారీ ర్యాలీగా బయలు దేరి విద్యుత్ సబ్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఏడీఈ వి.రవిశంకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు చార్జీల పెంపును నిరసిస్తూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి. శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో నిడదవోలులో శుక్రవారం పెద్ద ఎత్తున పోరుబాట నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీగా స్థానిక చాగల్లు రోడ్డులోని విద్యుత్ కార్యాలయానికి చేరుకున్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలంటూ వారు అక్కడ నినాదాలు చేశారు. అనంతరం ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పడం, మాయ చేయడం సీనియర్ సీఎం అయిన చంద్రబాబుకు తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ నిడదవోలు, పెరవలి మండల శాఖల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ, పెరవలి ఎంపీపీ కార్చర్ల ప్రసాద్, పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి గాజుల రంగారావు, వెలగన పోలయ్య, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, బి(్రె పార్వతి, ఆలమూరి భారతి, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎస్కే చాన్‌బాషా, గజ్జరపు రమేష్, మానుకొండ చంద్రబాబు, యాళ్ల రామారావు, మొదలవలస నాని, దేశాభక్తుల నాగు, బయ్యే కృష్ణబాబు, ఆలమూరి రాజ, కోటేశ్వరరావు, ఎస్కే రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో తలారి సారథ్యంలో..



కొవ్వూరులో విద్యుత్ శాఖ ఏడీఈ కృష్ణనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

కొవ్వూరు: తాము అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులు పెంచబోమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఆరు నెలల పాలనలో మూడుసార్లు బిల్లుల భారం మోపారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా శుక్రవారం కొవ్వూరులో వెంకట్రావు ఆధ్వర్యంలో భారీ పోరుబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వ మూడు విడతల్లో గృహ వినియోగదారులపై రూ.15,485.36 కోట్ల చార్జీల భారం మోపిందన్నారు. పెంచిన కరెంటు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కోరారు. స్థానిక విజయ విహార్ సెంటర్ నుంచి విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వరకూ వైఎస్సార్ సీపీ శ్రేణులు పోరుబాట ర్యాలీ నిర్వహించాయి. పెంచిన చార్జీలను తగ్గించాలంటూ ప్లకార్డులు పట్టుకుని కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ఏడీఈ కృష్ణ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. పోరుబాటలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి, చాగల్లు ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, పార్టీ మండల శాఖల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మన్మోహన్ మృతికి వైఎస్సార్ సీపీ సంతాపం

కొవ్వూరు: వివాద రహితుడు, మచ్చలేని నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక విజయవిహార్ సెంటర్లో శుక్రవారం మన్మోహన్ చిత్ర పటానికి తలారి పూలమాల వేసి నివాళి అర్పించారు. రెండుసార్లు ప్రధానిగా పని చేయడమే గాకుండా ఆర్థిక సంస్కరణల సారథిగా మన్మోహన్ పేరు గాంచారన్నారు. ఆయన మృతికి తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి, చాగల్లు ఎంపీపీలు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి డాక్టర్ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నిడదవోలు, పెరవలి మండలాల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమళ్ల సత్యనారాయణ, పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కామిశెట్టి సత్యనారాయణ, ఎస్కే వజీరుద్దీన్, పువ్వల రతీదేవి, వెలగన పోలయ్య, యాళ్ళ రామారావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మన్మోహన్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు



నిడదవోలులో మన్మోహన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గూడూరి శ్రీనివాస్ తదితరులు

తాళ్లపూడి: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి, ఏఎస్‌వో బి. వెంకటేశ్వరరావు, ఆర్ఐ రామకృష్ణ, మండల సర్వేయర్ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు పలు అర్జీలు

నల్లజర్ల: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ అన్నారు. పడమర చోడవరంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. తన తండ్రికి ఆస్తిలో హక్కు కల్పించకుండా అన్నదమ్ములు ఆస్తిని పంచేసుకున్నారని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని అయినపర్తి జాన్ అనే రైతు కోరారు. తన పొలం 22 సెంట్లు ఆన్‌లైన్ కాలేదని, వెంటనే ఆన్‌లైన్ చేయాలంటూ మరో రైతు కసుకుర్తి భరత్ విజ్ఞప్తి చేశారు. తన పేరున ఉన్న 73 సెంట్ల పొలాన్ని తన ప్రమేయం లేకుండానే తన కొడుకు అతడి పేర ఆన్‌లైన్ చేయించుకున్నాడని చోడసాని నరసింహారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. దానిని రద్దు చేసి మళ్లీ తన పేరున ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దారు ఎస్‌వీకే నాయుడు, వీఆర్వోలు లక్ష్మణమూర్తి, మధు, శామ్యూల్, చంద్రబాబు, సురేష్ పాల్గొన్నారు.



పడమర చోడవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శాంతిప్రియ

నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు

తాళ్లపూడి: సీపీఎం 24వ జిల్లా మహాసభలు, శని,ఆదివారాల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, జువ్వల రాంబాబు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభల లోగోను శుక్రవారం తాళ్లపూడి రైస్‌మిల్ సెంటర్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రాజమహేంద్రవరంలోని మునిసిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ ప్రజాప్రదర్శన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కోటిపల్లి బస్‌స్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 29న నిర్వహించే ప్రతినిధుల సభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. ప్రజా సమస్యలపై ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ సభ్యులు ఎస్కే బాబ్జి వి.నరసింహమూర్తి, రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు విరమించాలి

నల్లజర్ల: రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు విరుద్ధంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను విరమించాలని నల్లజర్ల మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పేర్కొంది. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్‌మిశ్రా శుక్రవారం ఏలూరు వచ్చారు.ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఆయనను కలసి తమ అభిప్రాయాన్ని వినతి పత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారికంగా జనాభా లెక్కలు జరిగినప్పటికీ వాటిని పక్కన పెట్టి ప్రభుత్వం తనవద్ద ఉన్న ధృవీకరించబడని లెక్కలతోనే వర్గీకరణ చేయాలనుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంటరానితనం, సామాజిక వెనుకబాటు, అసమానతల ఆధారంగా రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఎస్సీ రిజర్వేషన్‌ను రాజకీయ లబ్ధి కోసం, ఒక వర్గం స్వార్థ ప్రయోజనాల కోసం రిజర్వేషన్లను వర్గీకరించాలని ప్రభుత్వం యత్నించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు గుదే వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వడ్డి శ్రీను, కోశాధికారి జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుజ్జుల రమేష్, సహ కార్యదర్శి గారపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర యూనిట్‌గా చేపట్టాలి

చాగల్లు: ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్ర యూనిట్‌గా చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జోన్ -2 చైర్మన్ జొన్నకూటి వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు పలు అంశాలపై వినతి పత్రాన్ని శుక్రవారం ఏలూరు విచ్చేసిన వన్‌మేన్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు అందజేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వర్గీకరణ అంశంపై ప్రభుత్వం త్వరితగతిన దృష్టి సారించాలన్నారు. తద్వారా ఉప కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ప్రధానంగా రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రచురించిన కులాల వివరాలు తప్పుగా ప్రచురించిన విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని కమిషన్ రాజీవ్ తెలిపారన్నారు.



కమిషన్ రాజీవ్ రంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న జొన్నకూటి వరప్రసాద్

హక్కులపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలి

చాగల్లు: కిశోర బాలికా వికాస కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కిశోర బాలికా వికాస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కిశోర బాలికల (14-18 సంవత్సరాల మధ్య వయసు) వ్యక్తిత్వ అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సామాజిక స్థాయిలో భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, లైఫ్ స్కిల్స్, హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ విద్యా ప్రోత్సాహం, బాలికల విద్యాభ్యాసంపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారి ఆర్.శ్రవణ్ కుమార్, ఎంఈఓ సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, ఏఎన్ఎంలు, గ్రామ మహిళా సంరక్షణ అధికారులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

దేవరపల్లి: కోస్టల్ బ్యాంక్ దేవరపల్లి శాఖలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక డాక్టర్ సుమంత్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఎండీ, ప్రముఖ కార్డియాలజిస్ట్ కె.సుమంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ జిల్లా ప్రతినిధి కేశిరాజు వెంకటరాజ్‌కుమార్ ప్రారంభించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నిర్వహించిన వైద్య శిబిరంలో 50 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కోస్టల్ బ్యాంకు రజతోత్సవ వేడుకలను శుక్రవారం బ్రాంచిలో మేనేజరు కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ సుమంత్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. బ్యాంకు డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

లక్ష్మీనరసింహునికి లక్ష తులసి పూజ

పెరవలి: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని తీపర్రు గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శుక్రవారం ఘనంగా లక్ష తులసి పూజ నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజతో ఈ వేడుకకు శ్రీకారం చుట్టారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధన, పంచామృత స్థాపన, లక్ష తులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, హోమాలు, తర్పణలు, పూర్ణాహుతితో ఈ క్రతువు ముగిసింది. వేద మంత్రాలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. 12 ది వేదపండితులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు లక్ష తులసి పూజను వీక్షించారు. ఉదయం ప్రారంభమైన పూజలు సాయంత్రం వరకూ కొనసాగాయి. ఏటా ధనుర్మాసంలో స్వామివారికి లక్ష తులసి పూజ జరిపిస్తామని ఆలయ మేనేజర్ రామయ్య తెలిపారు. శ్రీనివాసుల విజయ గోపాలాచార్యుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పూజల్లో ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, వీవీఆర్ శేషాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది.

పోషణ వాటికను సందర్శించిన ఎమ్మెల్యే



సంగాయగూడెం పోషణ వాటికలో సాగు చేస్తున్న ఆకుకూరలను పరిశీలిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భవతులు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పంపిణీ చేసేందుకు మండలంలోని సంగాయగూడెం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోషణ వాటికను శుక్రవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సందర్శించారు. వాటికలో సాగు చేసిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయల పంటను ఆయన పరిశీలించారు. ఎటువంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించి పంటలు పండిస్తున్నట్టు అంగన్‌వాడీ వర్కర్లు తెలిపారు. గర్భవతులకు ఆకుకూరలు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, సీడీపీఓ నాగలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు విజయశాంతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సైనికుడి గన్ మిస్‌ఫైర్

నిడదవోలు: స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం రాత్రి ఆర్మీ మాజీ సైనికుడి గన్ మిస్‌ఫైర్ అయ్యింది. అయితే ఎవరికీ ఏమీ జరగకపోవడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన ఆర్మీ మాజీ సైనికుడు కారింకి శ్రీనివాస్ వెరిఫికేషన్ నిమిత్తం తన లైసెన్స్‌డ్ గన్‌ను గురువారం రాత్రి నిడదవోలు సీఐ కార్యాలయానికి తీసుకొచ్చాడు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గన్‌ను సీఐ సమక్షంలో వెరిఫికేషన్ చేయించుకోవాలి. ఈ క్రమంలో గన్‌ను తీసుకువచ్చిన శ్రీనివాస్ సీఐ కార్యాలయంలో సిబ్బంది ఉండడంతో హాలులో కూర్చున్నాడు. ఈ సమయంలో శ్రీనివాస్ వద్ద లోడ్ చేసి ఉన్న గన్ కిందపడి మిస్ ఫైర్ కావడంతో ఆయన కాలికి స్వల్ప గాయమైంది. లోడ్ చేసిన గన్ ఆర్మీ మాజీ సైనికుడి చేతిలో మిస్ ఫైర్ అయి ఉంటే చాలా ప్రమాదం జరిగి ఉండేదని పోలీసులు భావిస్తున్నారు. నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ సమక్షంలో పట్టణ ఎస్సై పి.శోభన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నేడు నిడదవోలు మున్సిపల్ సమావేశం

నిడదవోలు: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం12 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు కమిషనర్ టి.కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు శుక్రవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

గీతామందిరం నిర్వాహకుడు గోపాల్ ప్రభు మృతి



గోపాల్ ప్రభు భౌతిక కాయం

కొవ్వూరు: స్థానిక గీతా మందిరం నిర్వాహకుడు న్యాసి మహరాజ్ (గోపాల్ ప్రభు) శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆయన సుదీర్ఘ కాలంగా గీతా మందిరం నిర్వాహకుడిగా ఉన్నారు. ఆయన మృతి పట్ల భక్తుల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆలయ నిర్వాహకులు తమ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక భక్తులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆసుపత్రిలో కాపర్ పైప్‌ల చోరీపై కేసు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఆక్సిజన్ అందించే కాపర్ పైప్‌లు చోరీకి గురయ్యాయి. ఈనెల 25న జరిగిన ఈ చోరీపై ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.సత్యవతి తమకు ఫిర్యాదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం శుక్రవారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు సీఐ తెలిపారు.

ఎద్దులను తరలిస్తున్న రెండు వాహనాల సీజ్

కొవ్వూరు: అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు బొలేరో వాహనాలను శుక్రవారం సీజ్ చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పట్టణ శివార్లలోని గామన్ ఇండియా టోల్ గేట్ వద్ద ఈ వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. ఈ వాహనాల్లోని ఏడు ఎద్దులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఎద్దులను గోకవరంలోని గోశాలకు అప్పగించామన్నారు. రెండు వాహనాల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

స్నేహితుడి ఇంటి వద్ద ఉంచిన బైక్ చోరీ

కొవ్వూరు: పట్టణంలోని మెరక వీధిలో గురువారం రాత్రి చాగల్లుకు చెందిన గానుబోయిన రాజు అనే వ్యక్తికి చెందిన పల్సర్ మోటార్ సైకిల్ చోరీకి గురైంది. రాజు తన బైక్‌ను కొవ్వూరు మెరక వీధిలోని స్నేహితుడి ఇంటి వద్ద ఉంచి పనిమీద రాజమహేంద్రవరం వెళ్లాడు. తర్వాత రోజు కొవ్వూరు తిరిగి వచ్చి చూసేసరికి స్నేహితుడి ఇంటి వద్ద మోటార్ సైకిల్ కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ చోరీకి పాల్పడ్డారు. దీనిపై రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.